కథ

# కొండ దేవుడు

బండి విహారి

(గతవారం తరువాయి)

**ఇంతలో నీళ్ళలోనుండీ ఒక లావుపాటి మనిషి ఆయాసపడుతూ మా పక్కకొచ్చి నిలబడ్డాడు మాకేదో చెప్పాలన్నట్టు.**

**రహస్యం కాబోలని అతని పక్కగా జరిగాను. నడుంమీద రెండు చేతులూ వేసి గాఢంగా ఊపిరి పీలుస్తున్నాడు. అతని నల్లటి బొజ్జ అటూ ఇటూ కదుల్తోంది ఊపిరాడక.**

పాపం ఆస్మామనిషి కాబోలు. ఒళ్ళంతా ఒకటే కంపు.

చెవిని రిక్కించి ఆయన నోటికానించాను అదేదో ఇంకా చెప్పడేమని. ఉన్నట్టుండి 'వ్యాక్' అని డోక్కున్నాడు నిలుచున్నచోటే.

అప్పుడుకానీ అతని పరిస్థితి నాకర్థం కాలేదు.

ప్రసాద్ పంచె విప్పుతున్నాడు.

'నీళ్ళు బాలేవు' అన్నా గుర్తు చేస్తున్నట్టు.


ఒకసారి నీళ్ళవైపు చూసి- 'అయినా తప్పదు' అన్నాడు.

'పక్కనే మంచినీళ్ళు అమ్ముతున్నారు నేనక్కడ స్నానం చేస్తా' అన్నాను.

'వుండుండు... నీళ్ళు ఎట్లున్నా ఇది ఆచారంలాగుంది. పవిత్రమైంది, పుణ్యం వస్తుంది. లేకపోతే ఇంతమంది మునుగుతారా ఆ ఇద్దరూ పైకి పోతారా? మూడే మూడుసార్లు మునిగి కావల్సింటే అక్కడికి పోదాం!' అన్నాడు.

నీళ్ళు ఎలాంటివైనా ఇంతమంది మునిగారు కాబట్టి ఇది పవిత్రమైనదే. అవును మరి! ఎదురుగా వున్న పుణ్యాన్ని వృధాగా ఎందుకు పారేసుకోవడం? చేతనయినంత, చేతికి చిక్కినంత మూట కట్టుకుందాం.

బయట నీళ్ళు కొనుక్కుని స్నానం చేస్తున్న వారివైపు తిరిగాను.



'వారంతా ఇక్కడ మునిగినవారేలే స్వామీ?' అంటూ మునిగాడు పవిత్రమో, అపవిత్రమో తెలీని నీటిలోకి మూడుసార్లు మునిగాడో లేదో, ఎవరినో తన్నడానికన్నట్టు ఆవేశంగా బయటికొచ్చాడు రౌద్రమైన మొహంతో.

వెంటనే కిందకు ఒంగి శరీరం మూలల్లోని గాలిని అంతటినీ కక్కుతున్నాడు కళ్ళు పెద్దవి చేసి.

తప్పదని నీళ్ళల్లోకి దిగాను నేనూ. అంతమంది భక్తి బ్రాహ్మణుల మధ్య తెలివి మీరినవాడిలా వుండటం ఇష్టంలేక.

మూడుసార్లు మునిగినా, ఇంకా ఏదో తడవనట్టుగా వుంది నా లోపల ఒట్టిగా. నాకు నేనే వాసన వేస్తున్నాను. రెండు బకెట్లు నీళ్ళు కొని స్నానం చేసిన తర్వాతకానీ ఊపిరితిత్తులనిండా గట్టిగా గాలి పీల్చి వదలలేకపోయినాను.

***

ఎరిమేలిలో రాత్రి ఒంటిగంటకు ఇరుముళ్ళు తలన పెట్టుకుని సగం మందికి పైగా వెళ్ళారు పెద్దపాదం నడవడానికి మా బస్సులో.

నేనూ, ప్రసాద్ చిన్న పాదం వెళ్ళాలని నిశ్చయించుకున్నాం. ఉదయాన్నే 'పంపా'కు చేరుకున్నాం మా స్వాములతో పాటూ.

ఈ ఉదయం ఎండకు పది గంటల వయస్సు. పెద్ద పాదం దారి ఓ చిన్న కొండలాంటి గుట్ట ఎక్కి 'పంపా'లోకి జారిపోతుంది. పెద్ద పాదం వెళ్ళిన సాములందరూ ఆదారెంబటే పంపాకు రావాలి. మా స్వాములకోసం ఎదురుచూస్తూ కూర్చున్నాం అక్కడ.

'అనంతపురం స్వాములు... అనంతపురం స్వాములు...' అని అరుస్తూ మొహాలు వెదుకుతున్నాము.

ఇరుముడి మూటను జాగ్రత్తగా మోస్తూ కాళ్ళీడ్చుకుంటూ పంపాకు వస్తున్నారు అయ్యప్పలు.

'అబ్బబ్బ ఏమి స్వాములబ్బా! చీమల పుట్ట పగిలినట్లొస్తాండారు!' అంటున్నాడొక స్వామి.

చిన్న టెంకాయచెట్టును మోసుకొస్తున్న స్వాములు ఎక్కడ కనబడినా, పరిగెత్తుకెళ్ళి సాష్టాంగపడుతున్నారు కొందరు.

అంతటి అలసటలోనూ తడబడుతున్న పాదాలను దగ్గరచేర్చి 'స్వామిశరణం' అంటూ నిలబడుతున్నారు ఆ టెంకాయ చెట్టు స్వాములు.

ఆ చిన్న టెంకాయచెట్టు ఎవరి చేతిలో

వుంటుందో, వారు మాల వేయడం పన్నెండోపడి అన్నమాట. అలాంటివాళ్ళ కాళ్ళకు మొక్కడం మంచిదంటారు.

ఎందరో స్వాములు...

ఎందరెందరో అయ్యప్పలు...

తండోపతండాలుగా వస్తున్నారు దుమ్ము కొట్టుకుపోయిన కాళ్ళతో... రాళ్ళకు తగిలి ఎండిన రక్తపుచారల కాళ్ళతో...

కుంటిస్వాములు... ముసలిస్వాములు... లావు స్వాములు... ముక్కుపచ్చలారని మణికంఠులు... రొప్పుతూ, ఆయాసపడుతూ వస్తున్నారు.

పిడచగట్టిన నాలుక ఎండిన పెదాలపైకి పాకుతోంది పదే పదే ఎడారిలో పాములాగా.

దారికి అటూ ఇటూ నిలబడి గాలి విసరుతున్నారు కొందరు.

చల్లని గాలి తమ శరీరాల్ని కప్పేయగానే, 'అయ్యప్పా!' అని పలవరిస్తున్నారు అక్కడే స్వామి దర్శనమైనట్టు.

మరికొందరు గ్లూకోజ్ ప్యాకెట్లు కొని గ్లూకోజ్ పంచుతున్నారు. గ్లూకోజ్ ప్యాకెట్ కనిపించగానే పది చేతులు విచ్చుకుంటున్నాయ్ చుట్టూ.

భగవాన్! ఇంతకంటే ఇంకేముందీ జీవితంలో? నీ భక్తులకు సేవ చేయడం కన్నా ఆనందం ఏం మిగిలిందీ జన్మలో?!

'స్వామియే శరణమయప్పా!'

'ఆపద్బాంధవనే శరణమయ్యప్పా!'

శరణాలు విన్పిస్తున్నాయ్ ఎండిన గొంతులోంచి కరకుగా.

ఈ భక్తి పారవశ్యంలోనే మిగిలిపోవాలనుంది. కానీ, మిగిలిపోవడం కాలానికి విరుద్ధం కదా!

మా స్వాములందర్నీ ఏరి ఏరి పట్టుకుని ఒకచోట చేరి కూర్చున్నాము. పంపానదీ స్నానం తర్వాత కన్నెపూజ జరిగింది. అంతా గోలగోలగా వుంది. ఏది మాట్లాడినా గట్టిగా మాట్లాడాలి.

ఆకలి అన్న సంగతి గుర్తొచ్చింది మధ్యాహ్నం కావస్తుండగా.

'ఈ రోజు బస్సులన్నింటినీ శివకోవిల్ దాటి పైకి రానీలేదు. మన వంట సామాన్లన్నీ దాన్లోనే వున్నాయి' అని చెప్పుకొస్తున్నాడు మా ఏజెంట్ పెద్ద పాదానికి వెళ్ళివచ్చినవారితో.

'ఎట్లబ్బా మనం ఈ కేరళ వంటలు తిన్లేమే!' అన్నాడు ఒకాయన చాపిన కాళ్ళను ఒత్తుకుంటూ.

'కేరళ వంటలు సరే కర్ణాటక వంటలు తినచ్చే' అంటున్నాడు ఇంకొకాయన చేతిలోని వంటకాన్ని నోట్లో పెట్టుకుంటూ.

అందరూ అటు వైపు తిరిగారు.

'ఎక్కడిది స్వామీ?'

'ఆ పక్కనే కర్ణాటక స్వాములు వంట చేసి అందరికీ పెడుతున్నారు'.

'ఏ పక్కన?' అంటూ పైకి లేచారు కొందరు.

'అకలయితోందిగానీ ఏమీ తినబుద్ధికావడం లేదబ్బా' అంటున్నారు మరికొందరు నీరసించిపోయిన మొహాలతో.

'కన్నెమూల గణపతి'కి టెంకాయ కొట్టి 'చిన్న పాదం' నడవడం ప్రారంభించాం సాయంకాలం ఆరుగంటలు కావస్తుండగా.

నేనూ, ప్రసాద్ ఉత్సాహంగానే కొండ ఎక్కుతున్నాం. పెద్ద పాదం నడచినవారు మాత్రం వెనుకబడ్డారు అలసటతో. రెండు వైపులా నోర్లు తెరుచుకున్న షాపుల్లో లైట్లు వెలుగుతున్నాయ్. మూడు కిలోమీటర్లు అలా ఎక్కామో లేదో లైను ఆగింది. ఏమని అడిగితే 'క్యూ మొదలైందని' అన్నారు.

ఇంకా నాలుగు కిలీమీటర్లు నడవాలి క్యూలో అని నిట్టూరుస్తున్నారు అందరూ.

నెమ్మదిగా కదుల్తోంది లైను. కప్పును మింగిన పాములాగ.

ఈ లైను డైరెక్ట్ సన్నిధానంకు అని రూఢి చేసుకున్నాము పడిపోవడానికి సిద్ధంగా వున్న పక్కాయన్ను అడిగి.



నేనూ, ప్రసాద్ ఉత్సాహంగానే కొండ ఎక్కుతున్నాం. పెద్ద పాదం నడచినవారు మాత్రం వెనుకబడ్డారు అలసటతో. రెండు వైపులా నోర్లు తెరుచుకున్న షాపుల్లో లైట్లు వెలుగుతున్నాయ్. మూడు కిలోమీటర్లు అలా ఎక్కామో లేదో లైను ఆగింది. ఏమని అడిగితే 'క్యూ మొదలైందని' అన్నారు.

అయితే ఈ లైను గర్భగుడివరకూ పాకివుందన్నమాట!

గర్భగుడి ముందున్న వ్యక్తి కదలిక ఎక్కడో కిలోమీటర్ల వెనుక నిలబడిన నాతో ఒక్క అడుగు వేయిస్తోంది. అయితే నా ఉనికికి కారణం ఎక్కడో వుంది నా కళ్ళకు కనబడని చోట.

ఎంత చిత్రం!!

***

పదకొండు కావస్తోంది. కప్పను మింగిన పాము కాదు. చచ్చిన పాములాగుంది లైను. నిలబడినచోటనే గంటసేపు నిలబడ్డాం.

గంట తర్వాత రెండడుగుల ఉపశమనం.

అంతసేపు నిలబడలేక కాళ్ళకిందున్న మూడంగుళాల స్థలంలోనే కూర్చుంటున్నారు ఇరుకు- ఇరుకుగానే

ఎక్కడ కొంచెం స్థలం కన్పించినా, అక్కడికి దూరెయ్యడమే!

అలా దూరినవాడిదే ఆ స్థలం.

నిజం చెప్పాలంటే, అది దూరడం కాదు. ఈదడం. అడ్డు వచ్చిన శరీరాల్ని పక్కకు తోస్తూ ఈదడం.

టీలూ, కాఫీలూ అమ్మేవాళ్ళు మా లైనును నియంత్రించడానికి వేసిన ఐరన్ ఫైపులకు అవతల తిరుగుతున్నారు. కాఫీ... టీ... అని అరుస్తూ.

దొంగ దారిలో... కొడుకులను తమ వెంట లాక్కెళ్తున్న నాన్నలు, అనుభవజ్ఞుల వెంట అటూ ఇటూ చూస్తూ పరిగెడుతున్న కన్నెస్వాములు కన్పిస్తున్నారు ఇరుముడి మూటల్ని బరువుగా మోస్తూ.

'ఇది తప్పుకదా స్వామీ!' అడిగాడు ప్రసాద్ దొంగదారిన పొయ్యేవారివైపు కోపంగా చూస్తూ.

వారిలో మా గురుస్వామి కూడా దిక్కులు చూస్తూ జారుకుంటున్నాడు.

గురుస్వాములు... మాలలు వేసే పెద్ద స్వాములు... నీతి నియమాలు బోధించే గురుస్వాములు... మా స్వాములందరికీ ఆదర్శప్రాయంగా వుండాల్సిన గురుస్వాములు... ఎవరి దారి వారిదే సన్నిధానం వైపు. స్వార్థాలకు అతీతమైన భగవంతుడ్ని చేరడానికి స్వార్థమనే పాత మాటనే పాడే మానవ నైజం ఎంత చిత్రం!!

పదకొండు గంటలకు గుడివాకిళ్ళు మూస్తారంట. మళ్ళీ పొద్దున నాలుగింటికి తెరుస్తారంట.

ఇంక దర్శనం పొద్దునే! అన్నారు.

నేనూ, ప్రసాద్ ఈతల పోటీ నుండీ

విరమించుకుంటున్నట్లు లైనునుండీ బయటపడ్డాం.

నాల్గింటికి లేచి మళ్ళీ పోటీలో పాల్గొందాం అనుకున్నాం. ఎక్కడివారు అక్కడ ఆక్రమించుకుని పడుకుంటున్నారు లైట్ల కాంతిలో.

చివరికి పేపర్లూ, కవర్లూ, తాగిపడేసిన టీ, కాఫీ గ్లాసులూ, ప్లాస్టిక్ బాటిల్స్ కలిసి మా కోసమే తయారైనట్టు చెత్తకుప్ప ఆహ్వానించింది తన గుండెల్ని పరిచి.

బహుశా అది అయ్యప్ప హృదయమే కావచ్చు.

ఈ దుమ్ము, ధూళిలో నన్ను నేను పారేసుకుంటేనే కానీ ఆయన భక్తి ఉత్సవంలో ఒక్కణ్ణి కాలేనేమో!

చెమట వాసనల్లో, చెత్త కుప్పల్లో పడి పోరాడితేనే కానీ, ఆయన స్వరూపం మనకు సాక్షాత్కరించదో!

ఇలా ఆలోచిస్తూ పడుకున్నాను చెత్త కుప్పపై, నా అవయవాలన్నింటికీ స్వేచ్ఛ ప్రకటించి. చాలా సుఖంగా వుంది. రకరకాల గొంతులు విన్పిస్తుండగా నా కనులు మూతలు పడ్డాయి.

***

శరీరానికేదో వెచ్చగా తగలడంతో మెలకువ వచ్చింది నాకు. ఎదురుగా వేపచెట్టు... పడగవిప్పి నీడ పట్టింది. పైన ఆకాశం నిర్మలంగా నవ్వుతోంది. నిద్రలోనుండే జారి, నేను "నేను"లోకి విచ్చుకోగానే నా మెదడులో దేనికోసమో ఆలోచనల వేట ప్రారంభం... ఆవులిస్తూ పైకి లేచాను.

ఎండకు నా కనుబొమ్మలు రెండూ దగ్గరకు జరిగాయి. వరుసగా నిలబెట్టిన బస్సులూ, కార్లూ, సుమోలూ అన్నీ నిశ్చింతగా వున్నాయి.

పలుచగా అయ్యప్పల సంచారం. మా బస్సు పైన నేను తప్ప ఎవ్వరూ లేరు. అప్పుడే అందరూ నిద్ర లేచినట్టున్నారు. బస్సు దిగి లోపలికెళ్ళాను. ఒక్కో సీట్లో ఒక్కొక్కరు హాయిగా చేరగిలబడి తీరిగ్గా మాట్లాడుకుంటున్నారు మా వాళ్ళు. వాళ్ళల్లో మా ప్రసాద్ కూడా వున్నాడు. అప్పుడే అందరివీ స్నానాలు అయిపోయినట్టున్నాయ్. నుదుటిమీద చందనం అన్ని మొహాలనీ కడిగేసినట్లుంది. వెళ్ళి నా బ్యాగ్ నుండీ బ్రెష్షూ, పేస్టూ తీసుకున్నాను.

నిన్నటి ఉదయం పదగొండు గంటలు కావస్తుండగా దైవదర్శనం అయ్యింది.

చుక్క నీటికోసం గొంతులు ఎండిపోయాయి. నీరసించిన మొహాలతో, తడబడుతున్న అడుగులతో గర్భగుడిని సమీపించాం. ఏ భక్తుణ్ణీ నిలుచున్నచోట క్షణం కూడా నిలువనీయడం లేదు పోలీసులు.

అయ్యప్పను చూడబోతున్నాను. ఏదో కిక్కు నా శరీరంలో...



నిన్నటి ఉదయం పదగొండు గంటలు కావస్తుండగా దైవదర్శనం అయ్యింది. చుక్క నీటికోసం గొంతులు ఎండిపోయాయి. నీరసించిన మొహాలతో, తడబడుతున్న అడుగులతో గర్భగుడిని సమీపించాం. ఏ భక్తుణ్ణీ నిలుచున్నచోట క్షణం కూడా నిలువనీయడం లేదు పోలీసులు.

ఆ క్షణమే నా కళ్లకు సాఫల్యం అనిపిస్తోంది. అయ్యప్పకు ఎదురుగా వచ్చాను–

చిన్న విగ్రహం.

బొద్దుగా వున్న పద్నాలుగేళ్ళ అయ్యప్ప.

నవ్వుతున్నాడు.

ఎంత ప్రేమో ఆ నవ్వులో! అందరిపట్లా అదే ప్రేమ పొంగుతోంది.

ఆ 'ప్రేమ' ఆది ప్రవాహం.

దిక్కులూ, ఆనకట్టలూ లేని మహా ప్రవాహమది.

ఎంతో నిర్లిప్తత ఆ నవ్వులో.

దీక్షలోని నియమాల పట్ల పెదవి విరుపుతనం నాలో. సమాజానికీ, 'ఉనికి'కీ మధ్య ఏ చీకటిమూలనో సంబంధం తెగిపోయింది.

ప్రాణి ఉనికికి సంబంధించిన మహా సత్యం సమాజపు మూసలోకి రాగానే దాని స్వరూపం కోల్పోయి దాని భావం మరుగున పడిపోయి కేవలం పాప పుణ్యాల కొలతల్లోకి కుదించబడింది.

సాయంత్రం కావస్తోంది.

ఒంటరిగా పడుకున్నాను చెట్టుకింద. మెత్తగా పరుచుకున్నాయ్ నీడలు. నా ఆలోచనల పరంపర కొనసాగుతూ వుంది.

ఇప్పుడిప్పుడే నాకో విషయం గుర్తుకు వస్తోంది–

ఆ రోజు సాయంత్రం మా అమ్మను చూడాలని ఇంటికి వెళ్ళినప్పుడు "అయ్యో స్వామీ! ఈరోజు నువ్వు నన్ను ముట్టుకోకూడదు.నేను..." అంది ఓ స్వరం తలుపు చాటు నుండే. అది మా అమ్మ స్వరమే.

ఆ రోజు అమ్మ బైటయ్యింది.

ఆ మాటలు మింగుడుపడక మిగిలిపోయినా ఆరోజు. కానీ ఆ మాటలు ఇంకా నా గుండెని కాలుస్తూనే వున్నాయి.

నా చూపులనుండీ అమ్మ వెలివేయబడటం కనీసం నా ఊహకైనా అందని వాస్తవం. నాకూ, మా అమ్మకూ మధ్య ఈ నియమాలు అడ్డుగోడలుగా నిల్చినా, నేను ఆ నియమాలను అసహ్యించుకున్నా,

ఆ బ్రాహ్మణ ఆచారాలను ప్రసాద్ గుడ్డిగా ఆచరించినా, అయ్యప్ప మాత్రం ఈ నీతి, నియమాలతో ఎటువంటి సంబంధం లేకుండా అలా... అందరి హృదయాల్లోకి సూటిగా చూస్తూ... కరుణామూర్తియై నవ్వుతున్నాడు.

"మనిషికీ మనిషికీ మధ్య అడ్డుగోడలు వుంటాయి. నీకూ, నాకూ మధ్య కూడా అడ్డుగోడలు వుంటాయా నాయనా!" అంటున్నాయి ఆ కొండదేవుడి చూపులు. •

# పిల్లలతో ఎలా మసలుతున్నారు?

మీ పిల్లలు చురుకుగా ఉండటం లేదా! చదువుల్లోను, ఆటపాటల్లోను మిగతా వారికంటే వెనకబడిపోతున్నారని దిగులుపడుతున్నారా! అందుకోసం పిల్లలపై అకారణంగా కోపం తెచ్చుకుంటున్నారా! అది సరికాదు. పిల్లల విషయంలో ఈకింది విధంగా మసలుకోండి.

* ప్రతి విషయంలోను ఎదుటివారితో పోల్చకండి. ఎవరి ప్రత్యేకత వారికుంటుంది.
* పెద్దలు చెప్పినట్టుగా వినితీరాల్సిందేనన్న మొండి వైఖరిని వదిలి పిల్లలతో స్నేహితుల్లా మెలగండి.
* ఏదైనా మంచి పని చేసినప్పుడు ప్రశంసించడం మరిచిపోకండి.
* వంటలో, ఇంటిపనుల్లో సలహాలిస్తూ వారిచే చిన్న చిన్న పనులు చేయించండి దాంతో పిల్లలు ఉత్సాహంగా ఇంటిపనుల్లో పాలుపంచుకుంటారు.
* తరచుగా టి.వి ముందు కూర్చోవద్దని హెచ్చరించే బదులు అలా టివి చూస్తూ కూర్చోవడం వల్ల లాభాలేంటో, నష్టాలేంటో అర్థమయ్యే విధంగా చెప్పండి.
* స్కూల్‌నుంచి ఇంటికి వచ్చింది మొదలు హోంవర్క్, చదువు అంటూ గంటలు, గంటలు వారిని నిర్బంధించకండి. ఆటలకు కూడా సమయాన్ని కేటాయించడం ఎంతో అవసరం. ఆ ఆటలు కూడా మీరు నిర్దేశించినవి కాకూడదు. పిల్లల ఇష్టాఇష్టాలకే వదిలెయ్యాలి.
* సెలవురోజుల్లో సాయంకాలాలు సరదాగా షికారుకు తీసుకెళ్ళండి.
* స్కూల్లో వారి ప్రవర్తన ఏవిధంగా ఉంటుందో అప్పుడప్పుడు స్కూల్‌కి వెళ్ళి ఉపాధ్యాయుల్ని అడిగి తెలుసుకోవాలి.